ముఖ్యమంత్రికి సాదర స్వాగతం



రాజాం: ఎమ్మెల్యే జోగులును ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



బొబ్బిలి: సీఎం జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి, ఆయన తనయుడు శ్రీకాంత్

రాజాం/బొబ్బిలి : భోగాపురంలో నిర్మించనున్న అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు శంకుస్థాపన నిమిత్తం బుధవారం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బొబ్బిలి, రాజాం ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, కంబాల జోగులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలతో పాటు బొబ్బిలి ఎమ్మెల్యే కుమారుడు శ్రీకాంత్‌ను సీఎం ఆప్యాయంగా పలకరించారు.

రెండు పూటలా పనిచేస్తే రూ. 250లు

రాజాం : ఉపాధి వేతనదారులు రెండు పూటలా పనిచేస్తే రోజుకు ఉపాధి వేతనం రూ.250లు దాటి వస్తుందని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండలంలోని ఒమ్మి, కొత్తవలస, చీకటిపేట తదితర గ్రామాల్లో ఉపాధి పనులు బుధవారం పరిశీలించారు. వేతనదారులు వద్ద వివరాలు సేకరించారు. పనులు చేసే విధానంపై అవగాహన కల్పించారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు ఇచ్చిన కొలతల ప్రకారం రెండు పూటలా పని చేసి, లక్ష్యానికి తగినట్లుగా రోజుకు రూ. 250లు దాటి సంపాదించాలని కోరారు. ఏపీఓ సాయిరాం, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



ఒమ్మి చెరువులో పనులు పరిశీలిస్తున్న అధికారులు

ముగిసిన దాడితల్లి ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

బొబ్బిలి: గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి పండుగ బుధవారంతో ముగిసింది. ఉత్తరాంధ్ర నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చివరి రోజు కూడా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ,ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా అనుపోత్సవం

తెర్లాం: మండలంలోని ఆమిటి, సింగిరెడ్డివలస, సీతారాంపురం, బొంగుపేట గ్రామాల్లో మూడు రోజులుగా జరుగుతున్న పైడితల్లి అమ్మవారి పండుగ బుధవారంతో ముగిసింది. పైడితల్లి అమ్మవారి పండగలో భాగంగా మంగళవారం సిరిమానోత్సవం జరిగిన విషయం తెలిసిందే. బుధవారం పైడితల్లి అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహించారు.

ఉద్దవోలులో డ్రోన్ సర్వే ప్రారంభం

• ఉద్దవోలులో డ్రోన్ సర్వే ప్రారంభం..

తెర్లాం: మండలంలోని ఉద్దవోలులో వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకంలో భాగంగా బుధవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. తహసీల్దార్ దోల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన డ్రోన్ సర్వేలో మండల సర్వేయర్ వెంకటరమణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ మాట్లాడుతూ, డ్రోన్ సర్వే ద్వారా గ్రామానికి చెందిన ఓఆర్ఐ మ్యాప్‌లు వస్తాయని, వీటి ద్వారా గ్రామాల్లోని అన్ని రకాల భూములకు సరిహద్దులు గుర్తించి, హద్దురాళ్లు పాతడం జరుగుతుందని తెలిపారు. భూముల రీసర్వే పూర్తయితే భూ సంబంధిత సమస్యలు తీరిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్ఓ రవి, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



ఉద్దవోలులో ప్రారంభమైన డ్రోన్ సర్వే



నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయం

9 నుంచి విగ్రహ పతిష్ఠ కార్యక్రమాలు

రాజాం : పట్టణంలో కొండంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ధర్మశాస్తా హరిహరసుత అయ్యప్పస్వామి దేవాయతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈ నెల 9నుంచి జరగనున్నట్లు ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావు బుధవారం తెలిపారు. 9న గ్రామ ప్రదక్షిణ, 10న విశేష అర్చనలు, 11న మూర్తి ప్రతిష్ఠ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

సంతకవిటి: మండలంలోని చిన్నయ్యపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. వేదపండితులు పులఖండం శ్రీధర్ శర్మ, రంప కోదండరామ శర్మల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ ప్రదక్షిణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



చిన్నయ్యపేటలో గ్రామ ప్రదక్షిణలో మహిళలు

ఎయిర్ పోర్టుకు వైఎస్సార్ పేరుపెట్టాలి

విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి పేరు పెట్టాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, సస్యశ్యామలం చేసేందుకు తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టును కూడా మంజూరు చేశారని చెప్పారు. అందువల్ల విమానాశ్రయానికి వైఎస్సార్ పేరు, టెర్మినల్స్‌కు కొమ్మూరి అప్పడుదొర, పెనుమత్స సాంబశివరాజు పేర్లను పెట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. గత ప్రభుత్వ హయాంలో విమానాశ్రయానికి ఎటువంటి అనుమతులు రాకుండానే, భూసేకరణ కూడా జరగకుండానే, చంద్రబాబు నాయుడు ఉత్తుత్తి శంకుస్థాపన చేశారని విమర్శించారు. ఎయిర్‌పోర్ట్ పేరిట చంద్రబాబు ప్రభుత్వం 5,600 ఎకరాల భూసేకరణ చేసేందుకు యత్నిస్తే అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంత మొత్తంలో భూములు అవసరం లేదని పోరాటం చేశారన్నారు. 2019 అధికారంలోకి వచ్చిన తరువాత తమ ప్రభుత్వం మంచి ప్యాకేజీ ఇచ్చి భూసేకరణ చేయడమే కాకుండా, 186 మంది నిర్వాసితులపై పెట్టిన 16 కేసులను తీసివేయించామని చెప్పారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల భోగాపురానికి గొప్ప భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రతిపక్ష టీడీపీ నేతలు ఎన్‌టీఆర్ పేరుతో ఉన్న తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి కనీసం నిధులు కేటాయించలేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి ప్రాజెక్టును పూర్తిచేసే దిశగా చర్యలు చేపట్టారన్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం

రాజాం సిటీ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 9న మండల సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీఓ బాసూరి శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని సూచించారు.

గ్రామాల్లో వైద్య సేవలు



వండానపేటలో ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి : మండలంలోని వండానపేట, కేఎంవలస, గుళ్లపాడు తదితర గ్రామాలో రేగిడి పీహెచ్‌సీకి చెందిన వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు బుధవారం నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఉచితంగా మందులు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గర్భిణులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

వార్డుల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

రాజాం : పట్టణంలో అన్ని వార్డుల్లో బుధవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ బుధవారం తెలిపారు. అకాల వర్షాల కారణంగా మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండి పట్టణ వాసులకు అసౌకర్యం కల్పించే ప్రమాదం ఉందని వెల్లడించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గ్యాంగ్ వర్క్ ద్వారా పారిశుద్ధ్య కార్మికులతో మురుగుకాలువల్లో చెత్తను తొలగించి, డంపింగ్ యార్డులకు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



పతాకావిష్కరణలో నినాదాలు చేస్తున్న ఏఐవైఎఫ్ కార్యవర్గం, విద్యార్థులు

బొబ్బిలి: పట్టణంలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి ఎస్.గణపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు ఉద్యోగ కల్పనలో ప్రధాని మోదీ విఫలమయ్యారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, ఏఐవైఎఫ్ నాయకులు సంతోష్, ఎస్.రాంబాబు, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయళ్లు అరెస్ట్

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలో పేకాటాడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆర్.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఐదుగురు నిందితులతో పాటు వారి వద్ద నుంచి 27,600 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

ఘనంగా గ్రామదేవతల పండుగ



గ్రామదేవతలకు ముర్రాటలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

రాజాం : పట్టణంలోని కొండంపేట గ్రామంలో గ్రామదేవతల పండుగ బుధవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు దేశాలమ్మతల్లి, పోలిపల్లి పైడితల్లి, అసిరితల్లి, బంగారమ్మ తల్లి గ్రామదేవతలకు ముర్రాటలు చెల్లించారు. గ్రామస్తులు అంతా ఐక్యతతో ఈ సంబరాలు నిర్వహించారు.

క్లుప్తంగా

భారీ అన్న సమారాధన



అన్నసంతర్పణలో పాల్గొన్న భక్తులు

రేగిడి : మండలంలోని అంబఖండి గ్రామంలో బుధవారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. మణికంఠస్వామి ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంబఖండితో పాటు వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, ఉంగరాడ, సోమరాజుపేట, సోమన్నపేట, గుళ్లసీతారాంపురం తదితర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు ఈ అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెడ్డి శ్రీరామ్మూర్తి సేవలు ఎనలేనివి

బొబ్బిలి: సీపీఎం నాయకుడు రెడ్డి శ్రీరామ్మూర్తి సేవలు ఎనలేనివని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో రెడ్డి శ్రీరామ్మూర్తి వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు ఎస్. గోపాలం, ఎ. సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సత్కారం



హేమలతను సత్కరిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్

రాజాం : స్థానిక సారధి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని బి.హేమలతను ఏపీఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి అభినందించి ఇటీవల సత్కరించారు. రాజాం బాలికోన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ క్లబ్ ఏర్పాటు చేయడంతో పాటు టీఎల్ఎమ్ తయారీ చేయడం, వీడియోలు ద్వారా వాటిని ఇతరులకు చేరవేయడం, విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచడం వంటివి బోధన కృత్యాలు నిర్వహించినందుకుగాను సత్కరించారు. విజయవాడలో డైరెక్టర్ అభినందించి, ప్రశంసాపత్రం అందజేయడంపై హేమలతను హెచ్ఎంతో పాటు ఇతర ఉపాధ్యాయినిలు అభినందించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ దుర్మార్గం



రాస్తారోకో నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

బొబ్బిలి: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడం దుర్మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధాని మోదీ విధానాలతో దేశం అల్లకల్లోలం అవుతోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మువ్వల శ్రీనివాసరావు, ముగడ వెంకటరమణ, ఎస్. గోపాలం, ఎ. సురేష్, జి. శ్రీనివాస్, ఎం. శ్రీనివాసరావు, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సర్వేతో శాశ్వత పరిష్కారం



కందిశలో హద్దులు వేస్తున్న సిబ్బంది

రేగిడి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు పథకంతో రైతులకు శాశ్వత భూసమస్యలు పరిష్కారం జరిగిందని తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి అన్నారు. మండలంలోని కందిశ, జోడిబందల తదితర గ్రామాల్లో రైతులకు సంబంధించిన భూములకు బుధవారం హద్దులు ఏర్పాటు చేశారు. రైతులు సమక్షంలో ఈ సర్వే చేయాలని వెల్లడించారు. సర్వే నంబర్లు ప్రకారం భూములకు సర్వే చేయడం జరిగిందని అన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

రాజాం సిటీ: మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ హెచ్చరించారు. ద్విచక్ర వాహం నడుపుతూ మైనర్లు ప్రమాదాలకు పాల్పడితే అటువంటి వారి తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయని అన్నారు. అలాగే లైసెన్సులు లేకుండా రోడ్లుపై వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి



బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు

• ఎమ్మెల్యే జోగులు

రాజాం : పేదలకు అండగా సీఎం సహాయ నిధి సాయం అందిస్తుందని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రాజాంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గడిముడిదాం గ్రామానికి చెందిన తుమ్మగుంట నారాయణరావుకు రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సాయం బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పార్టీలతో సంబంధం లేకుండా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న బాధితులకు సకాలంలో సాయం అందిస్తుందని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ వర్తించని రోగులు ఏ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న సంబంధిత చికిత్సకు చెందిన బిల్లులతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెల రోజుల వ్యవధిలో ఈ సాయాన్ని ప్రభుత్వం నేరుగా బాధితుని బ్యాంకు ఖాతాలో జమయ్యే విధంగా చెక్కులు అందిస్తుందని అన్నారు. తుమ్మగుంట నారాయణరావు గతంలో అనారోగ్యం కారణంగా ఆపరేషన్ చేయించుకున్నారని, సీఎంఆర్ఎఫ్‌కు నేరుగా దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వంగర కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

• ఎంఈఓ జె.త్రినాథరావు

తెర్లాం: ఏపీ క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నెల రోజుల పాటు నిర్వహించనున్న బేస్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులంతా సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేస్‌బాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను మంచి నైపుణ్యం గల క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. బేస్‌బాల్ క్రీడాకారులంతా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. హైస్కూల్ పీడీ, బేస్‌బాల్ శిక్షణ శిబిరం కోచ్ బంగారునాయుడు మాట్లాడుతూ, పాఠశాలలో నెల రోజులపాటు బేస్‌బాల్ క్రీడలో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి, బాడంగి కేజీబీవీ పీఈటీ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు వచ్చిన చిన్నారులు

ఆస్పత్రుల్లో పింఛన్ల అందజేత



రేగిడి : అంబాడ గ్రామానికి చెందిన పాలవలస చిన్నంనాయుడుకు శ్రీకాకుళం కిమ్స్‌లో ఫించన్ అందజేస్తున్న వలంటీరు ఎం.మనోరమ



సంతకవిటి: మండాకురిటి గ్రామానికి చెందిన అట్ల సావిత్రికి విజయనగరం ఆస్పత్రిలో ఫించన్ అందజేస్తున్న సచివాలయ వెల్ఫేర్ ఉద్యోగి పొన్నాడ బుచ్చిబాబు

అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు వైఎస్సార్ ఆసరా పింఛన్ లబ్ధిదారులకు వలంటీర్లు ఆస్పత్రులకు వెళ్లి బుధవారం పింఛన్లు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్

వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం

రేగిడి : మండలంలోని అంబఖండి గ్రామంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన వీరమణికంఠస్వామి (పుట్టలో వెలసిన అయ్యప్పస్వామి) ఆలయ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఈ నెల 1న ప్రారంభించిన ఈ ప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజుల పాటు వైభవంగా జరిగాయి. చివరి రోజు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠతో పాటు హరిహరపుత్ర ఆరాధన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీరఘట్టంకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో పూజలు జరగ్గా, గ్రామ పురోహితులు పులఖండం కృష్ణమూర్తిశాస్త్రి, ఆరవెల్లి రాంబాబుశాస్త్రిల పర్యవేక్షించారు.



నూతనంగా నిర్మించిన ఆలయం

ఎంఆర్‌పీకే విక్రయించాలి

మెంటాడ: ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పీకే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి గోకుల్ కృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఏఓ కార్యాలయంలో ఎరువు మందుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యత కలిగిన మందులు అందజేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపడితే చర్యలు తప్పవన్నారు.

క్రీస్తు ప్రేమను సమాజానికి చాటిచెప్పాలి

విజయనగరం టౌన్: క్రీస్తు ప్రేమను సమాజానికి చాటి చెప్పాలని బ్రదర్ మైఖేల్ విజయకుమార్ అన్నారు. బుధవారం స్థానిక వీటీ అగ్రహారం కొత్త మజ్జిపేటలో ఉన్న ఎస్‌టీసీ చర్చిలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో చర్చిలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. క్రైస్తవులకు రక్షణ కల్పించి, మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు. పీటీసీ ప్రిన్సిపల్ టి. ఆనందబాబు మాట్లాడుతూ, క్రీస్తు నేర్పిన బోధనలు క్రియల రూపంలో సమాజానికి చూపించాలన్నారు. డాక్టర్ పి.ప్రేమానందం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బిషప్ ఎం.పాల్సన్, డాక్టర్ బి. ఉదయ్‌చంద్ర, రెవరెండ్ ఎస్. మధు, డి.ఎలీషా, సైమన్ సుధీర్, ఏసురత్నం, జయప్రకాష్, బిషప్ దేవప్రసాద్, అబ్రహం, ఎస్.జాన్, ఎం.దీపు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో



నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విజయనగరం ఫోర్ట్: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి సతీష్‌కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షరీఫ్, రహిమ్, సూరిబాబు, రమణ, తదితరులు పాల్గొన్నారు.